

ఇంటర్మీడియట్‌లోనూ సీబీఎస్ఈ విద్యావిధానానికి రాష్ట్ర ప్రభుత్వం నాంది పలకనుంది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఫస్టియర్‌లో జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) సిలబస్‌ను అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా పరీక్షల విధానం, మార్కుల కేటాయింపుల్లోనూ నూతన విధానానికి శ్రీకారం చుడుతున్నారు.

- చిత్తూరు సెంట్రల్, ఆంధ్రజ్యోతి



పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

- ఈ విద్యాసంవత్సరం నుంచి ఫస్టియర్‌లో సీబీఎస్ఈ విధానం
- నేడు జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం

ఇంటర్‌లోనూ జాతీయ ప్రమాణాల విద్య

ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో మ్యాథ్స్- ఏ, బీ రెండింటినీ ఒకే సబ్జెక్టుగా.. బోటనీ, జువాలజీ సబ్జెక్టులను కలిసి బయాలజీగా రూపొందించారు. పార్టు-1 సబ్జెక్టు కింద ఆంగ్లం మాత్రమే ఉంటుంది. పార్టు-2 కింద జాతీయ భాషలతోపాటు మరికొన్ని సబ్జెక్టులుంటాయి. విద్యార్థి తన అభీష్టం మేరకు ఏదైనా ఎంపిక చేసుకునే వెసులుబాటు ఉంది. పార్టు-2లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ గ్రూపు సబ్జెక్టులు ఉంటాయి. నూతన విధానంలో ఎంపీసీ విద్యార్థి అదనపు సబ్జెక్టుగా బయాలజీని, బైపీసీ వారు గణితాన్ని ఎంచుకోవచ్చు. పార్టు 1,2,3 సబ్జెక్టుల్లో వచ్చిన మార్కులనే పరిగణిస్తారు. ప్రశ్నపత్రాల్లోనూ మార్పులు తీసుకురానున్నారు. సైన్స్ సబ్జెక్టుల్లో 80 మార్కులకు, ఇతర అంశాల్లో వంద మార్కులకు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్స్ 20 మార్కులు ఉంటాయి.

కోర్సులు ఇలా..

ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులుండగా, ఈ ఏడాది ఎంబైపీసీ, ఎంఈసీ గ్రూపులు కొత్తగా అమలు చేస్తున్నారు. తెలుగు, ఇంగ్లీష్, తమిళ మీడియంలు ఉండగా.. హిందీ, ఉర్దూ, తెలుగు, తమిళం ద్వితీయ భాషగా తీసుకునే వెసులుబాటు ఉంది.

జిల్లాలోని కళాశాలలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	31
ప్రైవేటు జూనియర్ కళాశాలలు	59
హైస్కూల్ ప్లస్	24
ఒకేషనల్ జూనియర్ కళాశాలలు	07
కేజీబీవీలు	08
రెసిడెన్షియల్ కళాశాలలు	01
మోడల్ స్కూల్స్	07
సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాలలు	04
మొత్తం కళాశాలలు	141
మొత్తం విద్యార్థులు	28,261

శిక్షణ పూర్తి

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని అధ్యాపకులకు నూతన విద్యా విధానం, సిలబస్, ఇతర పాఠ్యాంశాలపై ఏప్రిల్ 24 నుంచి మూడ్రోజులపాటు శిక్షణ పూర్తి చేశారు. మరో వైపు రాయలసీమ రీజియన్ పరిధిలో 68 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 400 మంది టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు, 68మంది ప్రిన్సిపాళ్ల బదిలీ ప్రక్రియ పూర్తయ్యింది.

రెండు దశల్లో అడ్మిషన్లు

ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్లు పొందేందుకు రెండు సార్లు అవకాశం కల్పించారు. ఏప్రిల్ 24 నుంచి మే 7వ తేదీ వరకు తొలి దశ అడ్మిషన్లు ప్రక్రియ చేపట్టగా, జూన్ రెండో తేదీనుంచి రెండో దశ అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి.

తొలి రోజునే పాఠ్య పుస్తకాల పంపిణీ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలు సోమవారం నుంచి పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు తొలిరోజునే పాఠ్యపుస్తకాలు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు 28,807 పాఠ్యపుస్తకాలు ఇవ్వనున్నారు. ద్వితీయ సంవత్సరంలో ఇప్పటికే కొందరికి అందజేయగా, మిగిలిన విద్యార్థులకు 5,464 పాఠ్యపుస్తకాలు ఇవ్వనున్నారు.

జాతీయ పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడమే లక్ష్యం

ఇంటర్‌లో సీబీఎస్ఈ అమలు చేయడం వల్ల ప్రతి విద్యార్థినీ రాష్ట్ర స్థాయితోపాటు జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయడమే ప్రభుత్వ లక్ష్యం. దీనికి అనుగుణంగా అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. ఈ ఏడాది ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి కృషి చేస్తున్నాం.

- శ్రీనివాసులు, డీఐఈవో, చిత్తూరు





సమావేశంలో పాల్గొన్న క్రిష్ణగిరి, చిత్తూరు జిల్లాల ఉద్యాన అధికారులు

గుజ్జు పరిశ్రమల ప్రలోభాలకు చెక్

- మామిడి ధరలపై క్రిష్ణగిరి, చిత్తూరు అధికారుల ఏకాభిప్రాయం

చిత్తూరు సెంట్రల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తమిళనాడు రాష్ట్రాల్లోని పండ్ల గుజ్జు పరిశ్రమలకు చెక్‌పెట్టే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. గుజ్జు పరిశ్రమలు నిర్ణయించే ధరల ప్రలోభాలకు రైతులు గురికాకుండా అధికారుల సమన్వయంతో ఒప్పందానికి వచ్చారు. క్రిష్ణగిరి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు మామిడి ధరలపై ఇప్పటికే సమన్వయ సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలో తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ మోహన్ ఆధ్వర్యంలో ఐదుగురు అధికారుల బృందం ఆదివారం చిత్తూరు జిల్లా ఉద్యానశాఖ కార్యాలయంలో ఉద్యానశాఖాధికారి మధుసూదన్, ఏడీ కోటేశ్వర్‌రావులతో మామిడి ధరలపై సుదీర్ఘ చర్చలు జరిపారు. రెండు జిల్లాల్లో మామిడి ధరలు ఒకేలా చూసుకుని రైతులకు గిట్టుబాటు కల్పించాలని నిర్ణయించారు.

పలమనేరు ఎలిఫెంట్ క్యాంపునకు
జయంత్, వినాయక్

రామకుప్పం/పలమనేరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ననియాల కౌండిన్య ఎలిఫెంట్ క్యాంపులోని కుంకీలు (శిక్షణ పొందిన ఏనుగులు) జయంత్, వినాయక్‌లను ఆదివారం పలమనేరు ఎలిఫెంట్ క్యాంపునకు తరలించారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లోని అటవీ సమీప పొలాలు, జనావాసాలపై గజదాడుల పరంపర కొనసాగుతుండటంతో కుంకీల సహకారంతో అడవి ఏనుగులను అడవులకే పరిమిత చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా పలమనేరులో ఎలిఫెంట్ క్యాంపు ఏర్పాటు చేసింది. ఇటీవల కర్ణాటక రాష్ట్రం నుంచి నాలుగు కుంకీలను ప్రభుత్వం పలమనేరు క్యాంపునకు తీసుకువచ్చింది. వాటికి అదనపు శిక్షణ ఇవ్వాలని అటవీశాఖ నిర్ణయించింది. దీనికోసం ననియాలలో ఇచ్చిన శిక్షణలో ఆరితేరిన కుంకీలు జయంత్, వినాయక్‌లను ఆదివారం పలమనేరుకు తరలించారు. కుంకీలతో పాటు నలుగురు మావటీలు అక్కడి నాలుగు కుంకీలకు మరింత శిక్షణ ఇస్తారని అటవీ అధికారులు తెలిపారు.





పలమనేరులోని ఎలిఫెంట్ క్యాంపు వద్దకొచ్చిన ఏనుగులు

నేడు 'పీజీఆర్ఎస్'

చిత్తూరు అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి విజ్ఞప్తులను తీసుకుంటారన్నారు. జిల్లా అధికారులంతా విధిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. అలాగే డివిజన్, మండల స్థాయిల్లోనూ అధికారులు పీజీఆర్ఎస్ నిర్వహించాలన్నారు. ● జిల్లా పోలీసు కార్యాలయంలోనూ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



పూతలపట్టులో బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

వాహనాల కోసం ఇక ఎదురుచూపుల్లేవ్!

- బియ్యం కార్డుదారులు ఖాళీ సమయాల్లో సరుకులు తీసుకోవచ్చు
- పండుగ వాతావరణంలో చౌకదుకాణాల్లో పంపిణీ ప్రారంభం

చిత్తూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలోలా వాహనాల కోసం బియ్యం కార్డుదారులు పనులు వదులుకుని గంటల తరబడి ఎదురుచూసే రోజులు ఇక ఉండవు. తమ ఖాళీ సమయాల్లో సరుకులను తీసుకోవచ్చు. ఎందుకంటే ఎండీయూ వాహనాలను రద్దు చేసి, చౌకదుకాణాల్లోనే సరుకుల పంపిణీకి ఈనెల నుంచి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా ఆదివారం పండుగ వాతావరణంలో చౌకదుకాణాల్లో సరుకుల పంపిణీని ప్రారంభించారు.

ఎక్కడెలా అంటే..

పూతలపట్టు మండల కేంద్రంలో, తవణంపల్లె మండలం ముత్తరపల్లెలో ఎమ్మెల్యే మురళీమోహన్.. రేషన్ దుకాణాలను ప్రారంభించి, కార్డుదారులకు బియ్యం పంపిణీ చేశారు. 'వైసీపీ హయాంలో వంద రూపాయల బియ్యం కోసం రూ. 500 కూలీ వదులుకుని బియ్యం వ్యాను కోసం ఎదురుచూసేవారు. మా ప్రభుత్వం ఆ విధానాన్ని రద్దు చేసి 15 రోజులపాటు రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయనుంది. ఈ ప్రతిపాదనను అసెంబ్లీలో నేను ప్రతిపాదించాను' అని ఎమ్మెల్యే చెప్పారు. ● చిత్తూరు నగరంలోని కాజూరు సర్కిల్‌లోని రేషన్‌షాపులో చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, డీఎస్వో శంకరన్, జీజేఎం ట్రస్టు చైర్మన్ గురజాల చెన్నకేశవులు నాయుడు తదితరులు బియ్యం పంపిణీ చేశారు. అలాగే మాజీ ఎమ్మెల్యే సీకే బాబు నగరంలోని పలు షాపులను వేరుగా ప్రారంభించారు. కుప్పం మున్సిపాలిటీలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం బియ్యం పంపిణీ చేశారు. ● ఆయా మండలాల్లో టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు రేషన్ షాపుల వద్ద సరుకుల్ని పంపిణీ చేశారు.

సరుకుల పంపిణీలో చిత్తూరు ప్రథమ స్థానం

జిల్లాలో 5,36,686 బియ్యం కార్డులు చెలామణిలో ఉండగా, తొలిరోజైన ఆదివారం 87,220 కార్డులకు, పోర్టబిలిటీ ద్వారా 14,205 కార్డులకు సరుకులు పంపిణీచేసి 15.69 శాతంతో రాష్ట్రస్థాయిలో చిత్తూరు ప్రథమస్థానంలో నిలిచింది. కాగా, కొత్త సాఫ్ట్‌వేర్‌తోపాటు సర్వర్లు మొరాయించడంతో డీలర్లకు ఒత్తిళ్లు అధికమయ్యాయి.

హోంగార్డు ఉద్యోగమంటూ మోసం

- మిట్టూరువాసి నుంచి రూ.3 లక్షల వసూలు
- ఫేక్ జాయినింగ్ ఆర్డర్‌తో ఎస్పీ ఆఫీసుకొచ్చిన బాధితుడు

చిత్తూరు అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సీఐడీ విభాగంలోని హోంగార్డు ఉద్యోగం ఇప్పిస్తామంటూ రూ.3 లక్షలు వసూలు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చిత్తూరు నగరం, మిట్టూరు ప్రాంతానికి చెందిన షేక్ ముబారక్ అనే యువకుడు హోంగార్డు ఉద్యోగం కోసం విజయవాడకు చెందిన గుర్తు తెలియని వ్యక్తికి పలు విడతల్లో రూ.3లక్షలు ఫోన్‌పేలో చెల్లించాడు. డబ్బులు తీసుకున్న వ్యక్తి శుక్రవారం జాయినింగ్ ఆర్డర్ పంపించారు. దాన్ని తీసుకుని ముబారక్ ఎస్పీ కార్యాలయానికి వెళ్లి చూపించగా.. పోలీసులు అది ఫేక్ అని తేల్చారు. వన్‌టౌన్ పోలీసులు బాధితుడు ముబారక్‌ను అదుపులో తీసుకుని విచారిస్తున్నారు. తప్పుడు ఆర్డర్‌తో జాయిన్ అయ్యేందుకు ఎలా వచ్చాడు, విజయవాడలో డబ్బులు వసూలు చేసిన వ్యక్తి ఎవరనే వివరాలు సేకరిస్తున్నారు. సోమవారం అధికారికంగా వివరాలు తెలిపే అవకాశాలున్నాయి.

చురుగ్గా పీఆర్ ట్రైనింగ్ సెంటర్ పనులు



పునాదుల స్థాయికి భవన నిర్మాణ పనులు

గంగాధరనెల్లూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గంగాధర నెల్లూరు మండలంలోని తూగుండ్రంకు రహదారి పక్కన పంచాయతీ రాజ్ (పీఆర్) జిల్లా ట్రైనింగ్ కేంద్రం నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. 1.50 ఎకరాల భూమిలో ప్రారంభమైన ఈ పనులు పునాది దశకు చేరుకున్నాయి. తర్జనభర్జనల అనంతరం ఇక్కడి స్థలాన్ని ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. నాలుగు నెలల క్రితం రూ.2కోట్లతో కేంద్రం భవన నిర్మాణానికి ఆమోదం తెలుపుతూ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ క్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్.. చిత్తూరు, గంగాధరనెల్లూరు మండలాల్లో ఇందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని ఆదేశించారు. దీంతో గంగాధరనెల్లూరు మండలంలో గంగాధరనెల్లూరు-తూగుండ్రం రహదారి పక్కన 1.50 ఎకరాల భూమిని ఖరారు చేశారు. ఈ స్థలం తమదేనని కొందరు కొన్ని రోజులపాటు ఆటంకం కల్పించారు. ఇదే స్థలాన్నే ఎంపిక చేస్తున్నట్లు కలెక్టర్ స్పష్టం చేయడంతో నెలరోజులుగా ట్రైనింగ్ సెంటర్ భవన నిర్మాణం పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికి భూమి మట్టానికి పైబడి పిల్లర్లతోపాటు పునాదులు నిర్మించారు. ఏడాదిన్నర లోపు పనులు పూర్తిచేసి భవనాన్ని అప్పగించాలని కాంట్రాక్టర్‌కు గడువు నిర్దేశించినట్లు తెలిసింది.

నాన్ టీచింగ్ స్టాఫ్ బదిలీలు

చిత్తూరు సెంట్రల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జోన్ పరిధిలోని విద్యాశాఖలో నాన్ టీచింగ్ స్టాఫ్ బదిలీలను కడప ఆర్జేడీ శామ్యూల్ ఆదివారం చేపట్టారు. చిత్తూరు జిల్లా విద్యాశాఖ నుంచి పలువురు ఇతర జిల్లాలకు బదిలీలు కాగా, వారి స్థానాల్లో ఇతర జిల్లా నుంచి సిబ్బంది బదిలీపై వచ్చారు. చిత్తూరు జిల్లా విద్యాశాఖలో సూపరింటెండెంట్లు సత్యనారాయణ, వీజీ రమణలు కడప డీఈవో కార్యాలయానికి, ప్రేమకుమారి కడప సమగ్ర శిక్షకు బదిలీ అయ్యారు. తిరుపతి జిల్లా టెక్స్‌బుక్స్ విభాగం నుంచి సూపరింటెండెంట్ రమేష్, కర్నూలు జిల్లా డీఈవో కార్యాలయం నుంచి సూపరింటెండెంట్ రవికుమార్‌లు చిత్తూరు డీఈవో కార్యాలయానికి బదిలీపై వచ్చారు. కాగా, తిరుపతి డీఈవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నందకుమార్ సూపరింటెండెంట్‌గా పదోన్నతిపై చిత్తూరు డీఈవో కార్యాలయానికి వచ్చారు. కాగా చిత్తూరు సమగ్ర శిక్షలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న స్వర్ణకుమారి సూపరింటెండెంట్‌గా పదోన్నతిపై చిత్తూరు డీఈవో కార్యాలయానికి బదిలీ అయ్యారు.

600 మోడల్ స్కూళ్లకు హెచ్ఎంలు

- కసరత్తు చేస్తున్న విద్యాశాఖ అధికారులు

చిత్తూరు సెంట్రల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీ ప్రక్రియలో భాగంగా జిల్లాలోని మోడల్ ప్రైమరీ స్కూళ్లకు హెచ్ఎంలు నియమించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 950 మోడల్ ప్రైమరీ స్కూల్ ఉండగా, 600 వాటిలో హెచ్ఎంల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులకు వెళ్లడానికి స్కూల్ అసిస్టెంట్ల నుంచి విల్లింగ్ కోరుతున్నారు. దీంతో వెయ్యి మంది వరకు ఆసక్తి చూపారు. అయితే వీరు ఎక్కడ, ఏ పాఠశాల కోరుకున్నారో కౌన్సెలింగ్ ద్వారా నిర్ధారించి సీనియారిటీ ప్రకారం హెచ్ఎంలుగా నియమించనున్నారు.

కాణిపాకంలో తరగని రద్దీ

స్వయంభు కాణిపాక వరసిద్ధుడి ఆలయం ఆదివారం కూడా భక్తులతో కిక్కిరిసింది. వేసవి సెలవులు ముగుస్తుండటంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వస్తున్నారు. క్యూలైన్లు పూర్తిగా నిండిపోయి ఆలయం వెలుపలకు వ్యాపించాయి. క్యూలైన్లలో భక్తులు ఇబ్బంది పడకుండా ఈవో పెంచలకిషోర్ చర్యలు చేపట్టారు.

- ఐరాల(కాణిపాకం), ఆంధ్రజ్యోతి



రేషన్ పంపిణీ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి నియామకం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ పంపిణీ పర్యవేక్షణ కోసం ప్రభుత్వం జిల్లాకు ప్రత్యేక అధికారిని నియమించింది. సరుకుల పంపిణీని ఆదివారం నుంచి మూడ్రోజులపాటు జిల్లాలో తనిఖీ చేయడానికి ప్రత్యేక అధికారిగా కృష్ణాజిల్లా లీగల్ మెట్రాలజీ శాఖకు చెందిన కంట్రోలర్ ఆఫీసర్ రాజేంద్ర ప్రసాద్ చిత్తూరుకు చేరుకున్నారు.

క్యూఆర్ కోడ్ కూడా..

డీలర్లు సరుకులు సక్రమంగా పంపిణీ చేశారా లేదా తెలుసుకోవడానికి, సమస్యలపై ఫిర్యాదులు చేయడానికి అన్ని రేషన్ షాపుల వద్ద క్యూఆర్ కోడ్‌ను అందుబాటులో ఉంచారు. దీనిద్వారా నేరుగా రాష్ట్రస్థాయి ఫిర్యాదుల విభాగానికి సమాచారం వెళుతుంది. తద్వారా లోపాలపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

స్కాన్ చేశాక వచ్చే ప్రశ్నలివే..

క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ద్వారా స్కాన్ చేశాక వచ్చే ప్రశ్నలు ఇలా ఉంటాయి. డీలర్ షాపు నెంబరు, రేషన్ కార్డు సంఖ్య, ఈనెలలో మీరు రేషన్ తీసుకున్నారా..? మీకు అందిన రేషన్ సరుకుల నాణ్యతపై మీరు సంతృప్తిగా ఉన్నారా? డీలర్ మీకు రేషన్ సరుకులు సరైన తూకంలో సరఫరా చేశారా? రేషన్ షాపు డీలర్ మీతో మర్యాదగా వ్యవహరించారా? రేషన్ షాపు డీలర్ మీవద్ద రేషన్ సరుకుల ధర కంటే ఎక్కువ డబ్బులు తీసుకున్నారా..? మీ మొబైల్ నెంబరు పొందుపరచండి..? అని ప్రశ్నలకు ఔను, కాదు అనే సమాధానాలు ఇవ్వాలి.

వైభవంగా వరదుడి గరుడసేవ

పోటెత్తిన భక్తులు



గరుడవాహనంపై విహరిస్తున్న ఇంద్రవరదుడిని దర్శించుకుంటున్న భక్తులు

యాదమరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): యాదమరిలోని త్రివేణి సంగమంలో ఉన్న ఇంద్రవరదుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయం, పరిసరాలు భక్తులతో పోటెత్తాయి. చిత్తూరు, గుడియాత్తం సమీప ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా గరుడపక్షి.. ఆలయంపై ఆకాశంలో చక్కర్లు కొట్టడం చూసి భక్తులు తన్మయత్వం చెందారు. రాత్రి కల్పవృక్ష వాహనంపై వేణుగోపాలస్వామి అలంకరణలో స్వామివారు దర్శనమిచ్చారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ, పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారు. గ్రామస్తులు, దాతల సహకారంతో ప్రసాదాలు పంపిణీ చేశారు. సోమవారం ఉదయం హనుమంత వాహనం, నాచ్చియార్ తిరుక్కోళం, సాయంత్రం కల్యాణోత్సవం, రాత్రి గజవాహన సేవ జరగనుంది.



కల్పవృక్ష వాహనంపై స్వామివారు - ఆలయంపై ఆకాశంలో చక్కర్లు కొడుతున్న గరుడ పక్షి

భోగ శ్రీనివాసమూర్తికి సహస్ర కలశాభిషేకం



శ్రీవారి పంచ బేరాలలో ఒకటైన భోగ శ్రీనివాసమూర్తిని తిరుమల శ్రీవారి ఆలయంలో పల్లవరాణి సామవై ప్రతిష్ఠించిన దినాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక సహస్రకలశాభిషేకాన్ని నిర్వహించారు. ఉదయం 6 నుంచి 8.30 గంటల వరకు శ్రీవారి ఆలయంలోని గరుడాళ్వార్ సన్నిధిలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి, భోగశ్రీనివాసమూర్తి, విష్వక్సేనుడిని వేంచేపు చేశారు. శ్రీవారి మూలమూర్తి ముందున్న గరుడాళ్వార్ సన్నిధిలో భోగశ్రీనివాసమూర్తిని, ఆయనకు అభిముఖంగా విష్వక్సేనుడిని ఆశీనులు చేశారు. తర్వాత శ్రీవారి మూలమూర్తిని భోగశ్రీనివాసమూర్తికి కలుపుతూ దారం కట్టి అనుసంధానం చేశారు. భోగశ్రీనివాసమూర్తికి నిర్వహించే భిషేకాది క్రతువులు మూలమూర్తికి నిర్వహించినట్లు అవుతుంది. అనంతరం వేద పండితులు వేద పారాయణం చేయగా, అర్చకస్వాములు ఏకాంతంగా ప్రత్యేక సహస్రకలశాభిషేకం నిర్వహించారు. కాగా, పల్లవరాణి సామవై పెరుందేవి క్రీ.శ 614లో జ్యేష్ఠ మాసంలో 18 అంగుళాల పొడవు కలిగిన వెండి భోగశ్రీనివాసమూర్తి విగ్రహాన్ని శ్రీవారి ఆలయానికి కానుకగా ఇచ్చారు. విమాన వేంకటేశ్వరుని విగ్రహం కింద భాగంలోని గోడపై ఈ శాసనం కనిపిస్తుంది. ఈ కలశాభిషేకంలో జీయర్ స్వాములు, చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరి షెడ్లలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: రూ.3.47 కోట్లు

శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 95,080

తలనీలాలు సమర్పించినవారు : 39,668

గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తిరుపతి అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, తోమాల, అర్చన, సహస్రనామార్చన, ఆలయ ప్రాంగణంలో సేనాధిపతి ఉత్సవం, ముఖమండపంలో వేంచేపు, సమర్పణ, ఆస్థానం ఇత్యాది పూజలు చేశారు. టీటీడీ జియ్యంగార్లు, అధికారులు, అర్చకస్వాములు పాల్గొన్నారు.

ఆరోగ్య యోగాకు మీరు సిద్ధమేనా!

- జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున కార్యక్రమాలు
- నేడు పులిగుండు వద్ద 2వేల మందితో యోగాంధ్ర



పులిగుండు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): యోగాపై ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్పించడానికి ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్రలో భాగంగా పలు కార్యక్రమాలను జిల్లాలో పెద్దఎత్తున నిర్వహిస్తున్నారు. అందుకు అనుగుణంగా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెలపాటు పలు కార్యక్రమాలు రూపొందించి ప్రజలను భాగస్వాములను చేస్తోంది.

ఇప్పటి వరకు 5,65,955 మంది పేర్ల నమోదు

మే 21వ తేదీ నుంచి ఈ కార్యక్రమాలను ప్రారంభించారు. యోగాలో పాల్గొనడానికి నిర్దేశించిన లక్ష్యం 8,11,354 మందికిగాను ఆదివారం నాటికి 5,65,955 మంది తమ పేర్లు నమోదు చేసుకున్నారు. పుంగనూరులో 24,112 మందికి 28,500 మంది, రొంపిచెర్లలో 11,587 మందికి 12,680 మంది, నింద్రలో 11,558 మందికి 11,993 మంది లక్ష్యానికి పేర్లు నమోదు చేసుకున్నారు. చిత్తూరు అర్బన్‌లో 75,349 మందికి 46,379 మంది నమోదు చేసుకోగా, రామకుప్పం, వి.కోట, బంగారుపాళ్యం, సదుం మండలాలు వెనుకబడిఉన్నాయి. వీరికి యోగాపై మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ ఇస్తున్నారు. ఇందుకోసం జిల్లా, మండల, మున్సిపల్, గ్రామ, వార్డు స్థాయిల్లోనూ కమిటీలున్నాయి. యోగా గురువులుగా బాబు నాయుడు, శ్రీనివాసులు నాయుడు వ్యవహరిస్తున్నారు.

పోటీలున్నాయి

ప్రజలకు యోగాసనాలతోపాటు వివిధ పోటీలు కూడా నిర్వహిస్తున్నారు. విజేతలకు బహుమతులు కూడా ఇస్తున్నారు. ఇప్పటివరకు 3,679 ప్రాంతాల్లో పోటీలు జరగ్గా 12,633 మంది పాల్గొన్నారు. వీరిలో 9,926 మందిని విజేతలుగా ప్రకటించి బహుమతులు అందజేశారు.

691 ప్రాంతాల ఎంపిక

యోగాంధ్ర కార్యక్రమాలను పెద్ద నిర్వహించాలన్నది జిల్లా యంత్రాంగం లక్ష్యం. అందులో భాగంగా 691 ప్రాంతాలను కార్యక్రమాల నిర్వహణకు ఎంపిక చేశాం. సోమవారం పులిగుండు వద్ద, ఈనెల 9న బోయకొండ, 15న కంగుంది కోటలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నాం. జిల్లాస్థాయిలో ఇప్పటికే 5508 మంది ట్రైనర్ల నమోదు జరగ్గా, వారిలో ఇప్పటివరకు లక్ష్యానికి మించి 5892 మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ యోగా సాధన చేస్తే, ఏకాగ్రత పెరుగుతుంది.



- మోహన్ కుమార్, డీఆర్వో

పులిగుండు వద్ద ఏర్పాట్ల పరిశీలన

పెనుమూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలంలోని పులిగుండు వద్ద సోమవారం రెండువేవల మందితో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా టూరిజం ఆఫీసర్ గౌరి ఆధ్వర్యంలో ఆదివారం ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దారు శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రుద్రయ్యనాయుడు, కార్జాల అరుణ, తలారి రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రావూరి వెంకటస్వామి జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న రావూరి వెంకటస్వామి

చిత్తూరు అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ రావూరి వెంకటస్వామి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిత్తూరులోని మురకంబట్టు, గాంధీ సర్కిల్‌తోపాటు పూతలపట్టు, పెనుమూరు మండలాల్లోనూ ఆయన శ్రేయోభిలాషులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆర్వీఎస్ నగర్‌లోని తన స్వగృహంలో ఎస్వీ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ వైస్ చైర్మన్ రావూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపక బృందం, అభిమానులు, కుటుంబీకుల నడుమ కేక్‌ను రావూరి వెంకటస్వామి కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలు ఆలయాల అర్చకులు, వేదపండితులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించగా, చర్చి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులతోపాటు ఎస్వీసెట్ ప్రిన్సిపాల్ మోహన్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ లోకనాథ రెడ్డి, అధ్యాపకులు రాజారెడ్డి, విజయ్‌కుమార్, అన్బు, అరసు, నౌషద్, రాజు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రాధాకృష్ణ కృపాసాగర్ ఆదివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి దర్శన ఏర్పాట్లు చేశారు. సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు, ఎస్‌ఐ ధరణీధర తదితరులు పాల్గొన్నారు.

ఒంటరి ఏనుగు హల్‌చల్

- పాళెం పంచాయతీలో టమోటా పంట, రాతి కూసాలు ధ్వంసం

కల్లూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాళెం పంచాయతీలో శనివారం రాత్రి ఒంటరి ఏనుగు హల్‌చల్ చేసింది. అటవీప్రాంతం సరిహద్దులోని అనేక పంచాయతీల్లో పంటలను ధ్వంసం చేసిన 13 ఏనుగుల గుంపు గత నెల 10వ తేదీన మండలాన్ని వీడటంతో ప్రజలంతా ఊపిరి పీల్చుకున్నారు. 20 రోజుల తర్వాత ఇపుడు ఒంటరి ఏనుగు ఒకటి మండలంలోకి ప్రవేశించింది. అన్నమయ్య జిల్లా పింఛానది ప్రాంతం నుంచి బయల్దేరిన ఈ ఏనుగు పులిచెర్ల మండలంలోని ఎర్రపాపిరెడ్డిగారిపల్లె పంచాయతీలోకి ముందుగా ప్రవేశించింది. తర్వాత దేవళంపేట పంచాయతీ మీదుగా పాళెం పంచాయతీలోని కల్లూరు-3 సచివాలయం వద్దకు వచ్చింది. కొంగరవారిపల్లెలోని రైతు సురేంద్రనాయుడు.. మామిడితోటకు అమర్చిన రాతి కూసాలను ధ్వంసం చేసింది. సమీపాన కల్లూరులోని రైతు కాలేషా పొలం వద్ద ఉన్న వరిమూట్లను చిద్రం చేసింది. అక్కడినుంచి కోటపల్లెలోని రైతు హరినాథ్‌కు చెందిన టమోటా పంటను తొక్కి నాశనం చేసింది. ఈ సందర్భంగా ఒంటరి ఏనుగు చేసిన ఘీంకారానికి స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అనంతరం మామిడితోటల గుండా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక వద్దకు ఒంటరి ఏనుగు చేరుకున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.



కోటపల్లె వద్ద ధ్వంసమైన టమోటా పంట



ధ్వంసమైన రాతి కూసాలు

హుండీ లెక్కింపులో నగదు చోరీపై విచారణ



మొగిలి ఆలయంలో విచారణ నిర్వహిస్తున్న ఏసీ చిట్టెమ్మ

బంగారుపాళ్యం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మొగిలిలోని కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపులో జరిగిన నగదు చోరీ ఘటనపై ఆదివారం దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ విచారణ చేపట్టారు. మొగిలికి చెందిన ప్రసాద్.. గ్రామస్తులతో కలిసి శనివారం ఆమెకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆదివారం మొగిలికి చేరుకుని ఈవో మునిరాజ, ఆలయ సిబ్బందిని గ్రామస్తుల సమక్షంలో విచారించారు. సీసీ పుటేజీలను పరిశీలించారు. సిబ్బందిని విడివిడిగా పిలిచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. నివేదికను దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ గురుప్రసాద్‌కు, రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆచార్యకు పంపుతున్నట్లు చిట్టెమ్మ తెలిపారు. వంశపారంపర్య ధర్మకర్త ఎంబీ విజయకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తిరుమల కొండపై వైసీపీ నేతల కుట్రలు : టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న సప్తగిరి ప్రసాద్

చిత్తూరు సిటీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై వైసీపీ నేతలు కుట్రలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైసీపీ నేతలను తిరుమల క్యూలైన్లలో పంపించి సీఎం డౌన్ డౌన్ అని నినాదాలు చేయిస్తున్నారని చెప్పారు. ఈ దుష్ప్రచారంతో తిరుమల పవిత్రత మంటగలుస్తోందన్నారు. ఇటీవల టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకరరెడ్డి.. గోవులు మృతి చెందాయని దుష్ప్రచారం చేసి టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నించారన్నారు. క్యూలైన్‌లో భక్తులకు పాలు, తాగునీరు, అల్పాహారం, భోజనం ఇతర వసతులన్నీ టీటీడీ కల్పిస్తోందన్నారు. నేతలు మోహన్‌రాజ్, మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'టెన్త్' రీవాల్యుయేషన్‌పై రాద్ధాంతం తగదు

'టెన్త్' రీవాల్యుయేషన్‌పై వైసీపీ అనవసర రాద్ధాంతం చేస్తోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ ఒక ప్రకటనలో విమర్శించారు. అనవసర ఆరోపణలతో బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఫలితాలు విడుదలయ్యాక కొన్ని పేపర్లలో తమకు అన్యాయం జరిగిందని విద్యార్థులు భావించినపుడు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోరడం ఎప్పటినుంచో వస్తున్న ప్రక్రియగా పేర్కొన్నారు. వచ్చే ఏడాది నుంచి చిన్న తప్పిదాలను కూడా సాధ్యమైనంత వరకు తగ్గించేందుకు ఓఎంఆర్ షీటు డిజైన్‌లో మార్పులు తేవాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన బోయకొండ

- గంగమ్మను దర్శించుకున్న 30వేల మంది భక్తులు





ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ - క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

చౌడేపల్లె, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునే ఆలయ అర్చకులు అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని స్వర్ణాభరణాలు, ప్రత్యేక పూలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో గంటల కొద్దీ క్యూలైన్లలో వేచియుండి అమ్మవారిని దర్శించుకున్నారు. వేకువజాము నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు క్యూలైన్లలో రద్దీ కొనసాగింది. సుమారు 30వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవా టిక్కెట్లతో ఆదివారం ఒక్కరోజు రూ.13లక్షల ఆదాయం ఆలయానికి చేకూరింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.



ఆరుద్ర పురుగులొచ్చాయ్

ఎర్రావారిపాలెం మండలంలో దుక్కి చేసిన పొల్లాలోకి ఆరుద్ర పురుగులొచ్చాయ్. అంటే.. ఖరీఫ్ పంటసాగుకు అదును ప్రారంభమైందని ప్రకృతి సూచనగా రైతులు భావిస్తారు. ఏటా జూన్ నెల ప్రారంభం కాగానే ఆరుద్ర పురుగులు పొలాల్లో దర్శనమిస్తాయి. ఆరుద్ర కార్తె ప్రారంభానికి ఈ పురుగులు పొలాల్లో కనపడటం వల్ల ఆరుద్ర పురుగులుగా పిలుస్తారు. ఎర్రగా మెరుస్తూ, పొలాల్లో చకచకా నడుస్తూ, ముట్టుకొంటే మృదువుగా ఉండే ఈ పురుగులు రైతులకు కనువిందు చేస్తాయి. పొల్లాలో ఆరుద్ర పురుగులు కనపడడం శుభసూచకంగా రైతులు భావిస్తారు. వర్షాలు బాగా కురుస్తాయని వీరి నమ్మకం.

- ఎర్రావారిపాలెం, ఆంధ్రజ్యోతి

పలమనేరు
కుప్పం/పుంగనూరు

యోగాతో సామాజిక దృఢత్వం



కుప్పంలో యోగా సాధన చేస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): యోగాతో ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడి తద్వారా సామాజిక దృఢత్వం సాధ్యపడుతుందని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పంలోని ఎన్టీఆర్ స్టేడియంలో 21న నిర్వహించబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా వలంటీర్ల రిజిస్ట్రేషన్ కార్యక్రమం జరిగింది. అందరూ కలిసి యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా పీఎస్ఎం మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల సారథ్యంలో 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించబోతున్నట్లు చెప్పారు. యోగాతో యువత సంపూర్ణ ఆరోగ్యవంతులై దేశ, రాష్ట్ర అభ్యున్నతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, టీడీపీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఆర్ముగం, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, తహసీల్దారు చిట్టిబాబు, పలువురు టీడీపీ నాయకులు, ప్రభుత్వ సిబ్బంది, యువత తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంఖాన్‌కు చల్లా సన్మానం



సర్పంచ్ ఇబ్రహీంఖాన్‌ను సన్మానిస్తున్న పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల పంచాయతీ సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్ ను పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆదివారం ఆయన పుట్టినరోజు సందర్భంగా ఘనంగా సన్మానించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో పాల్గొని ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు, అభిమానులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు



మహిళ అరెస్టు చూపుతున్న పోలీసులు

చౌడేపల్లె, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పెద్దయల్లకుంట్ల పంచాయతీ ఊటూరుకు చెందిన కృష్ణప్ప భార్య రెడ్డమ్మ(60) తన చిల్లర దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నారు. ఆమె వద్ద 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

'వెన్నుపోటు దినం' పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసీపీ నాయకులు

పుంగనూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రైవేటు బస్టాండులోని వైఎస్ఆర్ విగ్రహం ఎదుట ఆదివారం చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం ' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 4న తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీం బాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, కొండవీటి నాగభూషణం, షరీఫ్, చెంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అమరనాథ్‌రెడ్డి, ఆవుల అమరనాథ్, రాగానిపల్లె బాబు, రాజేష్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.


పేదలకు సేవ చేయడంలో ముందుండాలి



సమావేశంలో మాట్లాడుతున్న మానవతా సేవా సంస్థ ప్రతినిధులు

పుంగనూరు రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పేదలకు సేవ చేయడానికి దాతలు ముందుకు రావాలని మానవత సేవా సంస్థ ప్రతినిధులు డాక్టర్లు ప్రభాకర్, నందీశ్వరయ్య కోరారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మానవతా సేవా సంస్థ పేద ప్రజలకు సేవ చేయడానికి పని చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే ఫ్రీజర్ బాక్సులు, అంబులెన్స్ ప్రజలకు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సంస్థ ప్రతినిధులు నానబాల గణేశ్, నారాయణరెడ్డి, రెడ్డెప్పరెడ్డియాదవ్, గిరినాథ్ పాల్గొన్నారు.

ఖరీఫ్‌లో లాభసాటి వ్యవసాయం చేయాలి



రొంపిచెర్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగచింత గ్రామంలోని రైతులు ఖరీఫ్ సీజన్‌లో తక్కువ ఖర్చుతో లాభసాటి వ్యవసాయం చేసుకోవాలని కలికిరి కృషివిజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ మంజుల అన్నారు. ఆదివారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు వ్యవసాయం, ఉద్యాన శాఖ పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేరుశనగ విత్తన శుద్ధి చేసుకోవాలని.. కలుపుమందులు, పచ్చిరొట్ట ఎరువులు సమపాలల్లో వేసుకోవాలన్నారు. ఉద్యానశాఖ అధికారి రాజూనాయక్ మాట్లాడుతూ మామిడిలో కొమ్మలు కత్తిరించడంతో పూత సకాలంలో వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో సుధారాణి, ఏఈవో సుబ్రహ్మణ్యం, కేవీకే శాస్త్రవేత పీరూసాహెబ్, పశువైద్యాధికారి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

కుప్పం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కుప్పం పీఈఎస్ ఆసుపత్రి సమీపంలో శెట్టిపల్లె క్రాస్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. గుడుపల్లె మండలం శెట్టిపల్లెకు చెందిన చెన్నప్ప (60) రజక వృత్తి చేసుకుని జీవనం సాగించేవాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదివారం రోడ్డు దాటుతుండగా అతివేగంతో వస్తున్న లారీ ఢీకొంది. ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైన చెన్నప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. గుడుపల్లె పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై గ్రామాల్లో ప్రచారం



కెంపసముద్రంలో ప్రచారం చేస్తున్న సభ్యులు

రామకుప్పం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రబోధ సేవా సమితి కుప్పం, శివరామపురం విభాగాల ఆధ్వర్యంలో సభ్యులు ఆదివారం రామకుప్పం మండలం కెంపసముద్రం, జోగిండ్లు, బగళనత్తం, పాముగానిపల్లెల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీతతోపాటు ఇతర గ్రంథాల సారాన్ని వారు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సభ్యులు కృష్ణ, కృష్ణమూర్తి, ప్రకాష్, రంగప్ప, రాజకుమార్, శశాంక్, చందు, ఇందిర, వెంకటలక్ష్మీ, విమల, రాణీ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడిగా ధనుంజయ

రామకుప్పం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల కొత్త ప్రధానోపాధ్యాయుడిగా ధనుంజయ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన బంగారుపాళ్యం ఎంపీపీ పాఠశాల నుంచి పదోన్నతిపై రామకుప్పం బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయకుడిగా నియమితులయ్యారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయురాలిగా ఉన్న సుజాత పలమనేరు బాలికోన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు.

మహిళపై దాడి

పుంగనూరు రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): భూతగాదాలో ఓ మహిళపై బావ దాడి చేసి గాయపరచడంతో పుంగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలి కథనం మేరకు.. మండలంలోని బండ్లపల్లె పంచాయతీ మొరంపల్లెకు చెందిన గంగాధర్ భార్య లక్ష్మీదేవి(27) తన పొలంలో పశువులకు గడ్డి కోస్తుండగా గంగాధర్‌కు అన్న రమణ, మనోహర్ పొలంలో గడ్డి కోయరాదని కట్టెతో దాడి చేశారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఉచిత కంటివైద్య శిబిరానికి స్పందన



శస్త్రచికిత్సకు ఎంపికైన వారితో వైద్యసిబ్బంది

బైరెడ్డిపల్లె, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాలలో ఆదివారం మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులచే నిర్వహించిన ఉచిత కంటివైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. వైద్యనిపుణులు 43 మందికి కంటిపరీక్షలు చేసి ఐదుగురిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైద్యులు మణిశంకర్, ముష్రఫ్, మహతి ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

శివాడిలో లోపించిన పారిశుధ్యం



వీధిలో నిల్వ చేరిన మురుగు నీరు

పెద్దపంజాణి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాడిలో పారిశుధ్యం లోపించింది. గత కొంత కాలంగా గ్రామంలో ఎలాంటి పారిశుధ్య చర్యలు చేపట్టకపోవడంతో మురుగునీరు వీధులపై ప్రవహిస్తోంది. దీంతో దోమలు అధికమయ్యాయి. అంటురోగాలు ప్రబలే ప్రమాదముందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత పాలకులు, అధికారులు గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టాల్సి ఉంది.

7,075 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు సిద్ధం



పలమనేరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పలమనేరు వ్యవసాయ శాఖ డివిజిన్ పరిధిలోని 7 మండలాల్లోని రైతులకు ఈ ఖరీఫ్ సీజన్‌లో పంపిణీ చేసేందుకుగాను ప్రభుత్వం 7075 క్వింటాళ్ల వేరుశనగ కాయలు సిద్ధంగా ఉంచినట్లు వ్యవసాయ శాఖ ఏడీఏ గీత, మండల వ్యవసాయ శాఖ అధికారిణి సంధ్య తెలిపారు. 40 శాతం సబ్సిడీతో వీటిని పంపిణీ చేస్తామని తెలిపారు. పలమనేరుకు 672, బైరెడ్డిపల్లికి 1313, వి.కోటకు 1346, రామకుప్పానికి 1072, శాంతిపురం మండలానికి 1403, కుప్పానికి 848, గుడిపల్లికి 419 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీకి ఆయా మండలాల స్టాక్ పాయింట్లలో సిద్ధంగా ఉంచామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కిలో వేరుశనగ కె6 రకం పూర్తి ధర రూ. 93 కాగా రాయితీ రూ.37.20 పోను రైతు మిగిలిన మొత్తం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. 30 కిలోల బస్తా పూర్తి ధర రూ.2790 కాగా రాయితీ రూ.1116 పోను రూ.1674 చెల్లించాలన్నారు. 4 నుంచి రైతు భరోసా కేంద్రాల్లో విక్రయాలు ప్రారంభిస్తామని .. ఒక్కోరైతుకు బస్తా మాత్రమే అందజేస్తామని తెలిపారు. వేరుశనగ విత్తనాలు తీసుకొన్న ప్రతిరైతు తప్పక వేరుశనగ విత్తనాలు పొలాల్లో విత్తుకోవాలని సూచించారు.

కుక్కల దాడిలో రెండు పొట్టేళ్ల మృతి



చౌడేపల్లె, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో 2 పొట్టేళ్లు మృతి చెందిన సంఘటన చౌడేపల్లె మండలంలో ఆదివారం జరిగింది. మండలంలోని పెద్దకొండామరి పంచాయతీ కోటూరుకు చెందిన చాన్‌బాషా వ్యవసాయం చేసుకుంటూ 2 పొట్టేళ్లను మేపుకుంటున్నాడు. ఉదయం గ్రామంలోని కుక్కలు ఇంటి వద్ద ఉన్న పొట్టేళ్లపై చేశాయి. దాడిలో రూ.30 వేలు విలువ చేసే 2 పొట్టేళ్లు మృతి చెందాయి.

ఉచిత దంతమార్పిడి శస్త్రచికిత్స

చిత్తూరు రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన అమ్మఒడి ట్రస్ట్ ఆధ్వర్యంలో చెన్నైలోని చెట్టినాడు ఆస్పత్రిలో 16 మందికి ఉచిత దంత మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ట్రస్ట్ నిర్వాహకుడు పద్మనాభనాయుడు తెలిపారు. ఆపరేషన్ అనంతరం ఆదివారం వారిని చెన్నై నుంచి చిత్తూరుకు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. వీరందరికి ఆరు రోజుల పాటు భోజనం, ఆహారం, బస్‌చార్జీలను ఉచితంగా అందించినట్లు తెలిపారు.

పేరు మారని ప్రభుత్వ కార్యాలయాలు



పేరు మారని అప్పినపల్లె క్లీనిక్



పేరు మారని చామనేరు రైతు సేవా కేంద్రం

పెద్దపంజాణి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు నేటికి పాత పేర్లతోనే కొనసాగుతున్నాయి. పలు రైతు సేవా కేంద్రాలకు, క్లీనిక్‌లకు పేరు మార్చడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా రైతు సేవా కేంద్రాలు, క్లీనిక్‌లు పాత పేర్లతోనే కొనసాగుతున్నాయి.

పేరు మార్పులోనే ఇంత అలసత్వం ప్రదర్శిస్తున్న అధికారులు ప్రభుత్వ అభివృద్ధి పథకాలు ప్రజల్లోకి ఎలా తీసుకెళ్తారని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు, పాలకులు కార్యాలయాలపై పర్యవేక్షణ లేకపోవడమే వీరి నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపణలు ఉన్నాయి.

చౌక దుకాణాల్లోనే నిత్యావసరాల పంపిణీ



రొంపిచెర్లలో బియ్యం పంపిణీ చేస్తున్న చల్లా రామచంద్రారెడ్డి



పలమనేరు: తనిఖీ చేస్తున్న డీఎస్‌వో కార్యాలయ డీటీ శ్యాంప్రసాద్



కుప్పం మున్సిపాలిటీలో సరుకులు పంపిణీ చేస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ చౌక దుకాణాల్లో నిత్యావసర సరుకుల పునః ప్రారంభంతో ప్రజలకు అందాల్సిన సరుకులతో నాయకులు జేబులు నింపుకునే దోపిడీకి అడ్డుకట్ట పడిందని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం పురపాలక సంఘంలోని 5, 6, 7, 8, 9, 10 చౌక ధరల దుకాణాల్లో ఆయన ఆదివారం నిత్యావసర సరుకుల పంపిణీని లాంచనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, తహసీల్దారు చిట్టిబాబు, కౌన్సిలర్లు తిలకవతి, హంస, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు జిమ్ దాము, డీలర్లు, టీడీపీ నాయకులు గోపీనాథ్, సత్యేంద్రశేఖర్, అప్పు ముఖేశ్, మాజీ ఎంపీటీసీ వేణుగోపాల్, మునియప్ప, సుకుమార్, మురళీ, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

● **కుప్పం మండలంలో:** కుప్పం మండలంలో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, కడా సలహా మండలి సభ్యుడు రామచంద్రల ఆధ్వర్యంలో రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకుల పంపిణీ జరిగింది. డీలర్లు, టీడీపీ నాయకులు రమేశ్, దామోదర్, వెంకటాచలపతి, వెంకటేశ్, జయప్రకాశ్, రాజ్‌కుమార్, ప్రకాశ్, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

● **పుంగనూరు రూరల్:** మండల, పట్టణ పరిధిలోని పలు రేషన్ దుకాణాల్లో ఆదివారం బియ్యం, చక్కెర అందించారు. కార్యక్రమంలో తహసీల్దారు రాము, ఆర్ఐ పణికుమార్, కూటమి నాయకులు మాధవరెడ్డి, సీవీరెడ్డి, శ్రీకాంత్, పోలీస్‌గిరి, సుహేల్‌బాషా, సుబ్రహ్మణ్యంరాజు, దేశాధి ప్రకాష్, పగడాల రమణ, విరూపాక్షి, గంగాధర్, రమణ, సుబ్రహ్మణ్యం, సోము, బాలాజీనాయక్, శ్రీనివాసులు, కుమార్, హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

● **కల్లూరు:** చౌక దుకాణాల్లో అవకతవకలకు పాల్పడితే డీలర్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జయసింహ తెలిపారు. పులిచెర్ల మండల కేంద్రంలోని చౌకదుకాణంలో ఆదివారం రేషన్ సరుకుల పంపిణీని తహసీల్దార్ జయసింహ ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముల్లంగి వెంకటరమణ, కుమార్‌రెడ్డి, ధనంజయనాయుడు, మురళీధర్‌నాయుడు, రాణెమ్మ, నరేంద్రనాయుడు, నజీర్, రమణ, గిరినాయుడు, రవీంద్రారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● **రొంపిచెర్ల:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో పేదలందరికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన చిన్నమసీద్ వీధిలోని చౌకదుకాణంలో అధికారులతో కలిసి నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తహసిల్దార్ కిరణ్‌కుమార్, డీటీ ముబారక్, నవాబ్, రఘునాద్, షేక్‌కరీముల్లా, ఇబ్రహీంఖాన్, గౌస్‌పీర్‌ఖాన్, రామమూర్తి, తులసీరాం, ఇమ్రాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

● **చౌడేపల్లె:** స్థానిక టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి మండలంలోని అన్ని చౌకదుకాణాల్లో బియ్యం పంపిణీ చేపట్టారు. టీడీపీ నాయకులు హరిప్రసాద్, కార్తిక్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

● **సోమల:** రేషన్ సరుకులు పేదలకు డీలర్లు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పంపిణీ చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు తెలిపారు. ఆదివారం కందూరులోని రేషన్ దుకాణంలో ఆయన పలువురు లబ్ధిదారులకు బియ్యం, చెక్కర అందజేశారు. తహసీల్దార్ బెన్నురాజ్, టీడీపీ నాయకులు శివశంకర్, హరిప్రసాద్, వేణుగోపాల్ నాయుడు, ఉమాపతి నాయుడు, అష్రఫ్ అలీ,ఈశ్వర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● **గంగవరం:** కలగటూరు రేషన్ దుకాణంలో సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ మండలాధ్యక్షులు సోమశేఖర్‌గౌడ్, సర్పంచ్ ఈశ్వరమ్మతో కలిసి ప్రారంభించారు.

● **బైరెడ్డిపల్లె:** బైరెడ్డిపల్లె మండలంలో ఆదివారం తహసీల్దార్ ప్రసన్నకుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ జైకుమార్, నాయకులు, డీలర్లు పాల్గొన్నారు.

● **పెద్దపంజాణి:** ప్రభుత్వ నిర్ణయం మేరకు పెద్దపంజాణి మండలంలోని 25 పంచాయతీల్లో ఆదివారం రేషన్ పంపిణీ ప్రారంభించారు. తహసీల్దారు అనిల్‌కుమార్ , డీటీ బద్రినాథ్, వీఆర్‌వో సుజాత, ప్రకాష్, స్థానిక నాయకులు, లబ్దిదారులు ఉన్నారు.

● **పలమనేరు:** జిల్లా పౌరసరఫరా శాఖ నుంచి డిప్యూటీ తహసీల్దార్ శ్యాంప్రసాద్ పలమనేరు రంగాపురంలోని చౌకదుకాణాన్ని, గంగవరం మండల కేంద్రంలోని గంగవరం-2 చౌక దుకాణాన్ని ఆకస్మిక తనిఖీలు చేశారు.

● **శాంతిపురం:** పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం కృషిచేస్తోందని శాంతిపురం టీడీపీ మండలాధ్యక్షుడు విశ్వనాథనాయుడు తెలిపారు. మండల పరిధి వడగాండ్లపల్లె చౌకదుకాణంలో ఆయన రేషన్‌సరుకుల పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దారు శివయ్య, నేతలు విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, పీవీనాగరాజు, ఏఎంసీ నాగరాజు, రమేష్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్‌టీఆర్'కు పాలాభిషేకం



రామకుప్పంలో చౌకదుకాణం వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో నిరుపేదల ఆకలి తీర్చేందుకు రూ.2 లకే కిలో బియ్యం పథకాన్ని ప్రారంభించి దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ వారి హృదయాల్లో అన్నదాతగా నిలిచిపోయారని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు అంజనేయరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి తెలిపారు. ఆదివారం రామకుప్పం పట్టణంలోని చౌకదుకాణాల్లో ఎన్టీయార్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి నిత్యావసరాల పంపిణీని ప్రారంభించారు. అలాగే అన్ని పంచాయతీల్లో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సరకులు పంపిణీ చేశారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం(, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాణిపాకలో ఆలయం అన్నదాన కార్యక్రమానికి తిరుపతికి చెందిన భాగ్యవతి రూ.1,00,116 ఆదివారం విరాళంగా అందించారు. దాతను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. క్యాక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన సంతకాల సేకరణ

చిత్తూరు అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అపోలో యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి సంరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న సంతకాల సేకరణ కార్యక్రమం రెండో రోజైనా ఆదివారం కూడా కొనసాగింది. స్థానిక 23వ డివిజన్ పరిధిలోని జానకారపల్లె వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం 2076 మంది సంతకాలు చేసినట్లు ఆ కమిటీ కన్వీనర్ శోభారాణి తెలిపారు. ఇప్పటి వరకు 25వేల మంది అపోలో ఆస్పత్రికి వ్యతిరేకంగా సంతకాలు చేశారన్నారు.

ముగిసిన మహాభారత ఉత్సవాలు

సోమల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నంజంపేట గార్గేయ నదీ తీరంలోని గార్గేయ లింగేశ్వరస్వామి ఆలయం వద్ద గత 18 రోజులపాటు కొనసాగిన మహాభారత యజ్ఞం ఆదివారం ధర్మరాజుల పట్టాభిషేక కార్యక్రమంతో ముగిసింది. ఈ నేపథ్యంలో ఆలయం వద్ద పలువురు దాతలను ఆలయ ధర్మకర్త జయలలితమ్మ సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. అలాగే భాగవతారణి రత్నకుమారిని అభినందించారు.

ఆకట్టుకున్న కర్ణజననం

సోమల మండలం భారతంమిట్టలో ఆదివారం కర్ణజననం సందర్భంగా భాగవతారణి నాగరత్న భక్తులకు కథను వివరించారు. రాత్రి పీలేరు వేంకటేశ్వర నాటక మండలి కళాకారులు కర్ణ జననంలోని ముఖ్య ఘట్టాలను ప్రదర్శించారు. ఉభయదారులు జరిపిటి సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



ఊరేగింపులో గొల్లపల్లెమ్మ అమ్మవారు

ముగిసిన గొల్లపల్లెమ్మ జాతర

రొంపిచెర్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగచింత దాసరిగూడెంలో జరుగుతున్న గొల్లపల్లెమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఉదయం జంతుబలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో భాగంగా యువతకు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందించారు.

ఆధ్యాత్మికం

శాస్త్రోక్తంగా గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠ





చౌడేపల్లె, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బాలసముద్రం గ్రామ దేవతలు బోయకొండ గంగమ్మ, మారెమ్మల విగ్రహాలను శాస్త్రోక్తంగా వేదపండితులు ప్రతిష్ఠించారు. ఆదివారం మండలంలోని బాలసముద్రంలో గ్రామ దేవతలైన బోయకొండ గంగమ్మ, మారెమ్మలకు గ్రామస్తులు నూతన ఆలయాన్ని నిర్మించారు. వేదపండితులు గణపతి హోమం, దేవనంది ప్రార్థన, పంచగవ్య ప్రాసన, రక్షాబంధనం, వాస్తు హోమాలు, ప్రాణ ప్రతిష్ఠాపన, కుంభాభిషేకం నిర్వహించారు.

రెండో రోజూ కొనసాగిన సంతకాల సేకరణ



చిత్తూరు అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అపోలో యాజమాన్య నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి సంరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న సంతకాల సేకరణ కార్యక్రమం రెండో రోజైనా ఆదివారం కూడా కొనసాగింది. స్థానిక 23వ డివిజన్ పరిధిలోని జానకారపల్లె వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం 2076 మంది సంతకాలు చేసినట్లు ఆ కమిటీ కన్వీనర్ శోభారాణి తెలిపారు. ఇప్పటి వరకు 25వేల మంది అపోలో ఆస్పత్రికి వ్యతిరేకంగా సంతకాలు చేశారన్నారు. కార్యక్రమంలో ఆ కమిటీ కో-ఆర్డినేటర్ షణ్ముగం, సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన సీతారాముల కల్యాణోత్సవం

గుడిపాల, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఏఎల్.పురం,పేయన్నపల్లె గ్రామాల్లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సీతారామ కల్యాణోత్సవాలు వసంతాలతో ముగిశాయి. ఈ సందర్భంగా సీతారాముల వారిని పుష్ప పల్లకిలో ఊరేగించారు. స్వామికి భక్తులు హారతులిచ్చారు. గ్రామ పెద్దలు, పరిసర గ్రామస్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే



బురదమయంగా కేవీశ్రీరామాపురం రోడ్డు

విజయపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కేవీశ్రీరామాపురంలో తేలిక పాటి వర్షం కురిసినా రోడ్డు బురదమయంగా మారుతోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురికినీటి కాలువలు లేకపోవడంతో సిమెంటు రోడ్డు సైతం బురదమయంగా తయారవుతోందంటున్నారు. నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అలరించిన దుర్యోధన వధ



భీముడు, దుర్యోధనుడి మధ్య యుద్ధ సన్నివేశం

శ్రీరంగరాజపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అంకనపల్లిలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ ఆవరణలో మహాభారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన దుర్యోధన వధ కార్యక్రమం అలరించింది. భీముడు, దుర్యోధనుడి పాత్రధారుల యుద్ధ సన్నివేశాన్ని పాత్రధారులు పద్యాల రూపంలో ఆకట్టుకున్నారు. ద్రౌపదీ, పాండవుల విగ్రహాలకు పూజలు నిర్వహించి, పొంగళ్లు పెట్టారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశాన్ని నిర్వహించారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో ధర్మకర్త లింగారెడ్డి, రామనాథరెడ్డి, పురుషోత్తం, గురుస్వామి, జగన్నాధం, నాయుడు, గోవిందస్వామి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: పిళ్ళారికుప్పం గ్రామ సమీపంలో మహాభారత యజ్ఞంలో చివరి రోజైన ఆదివారం దుర్యోధన వధ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్జున, దుర్యోధన వేషదారుల మధ్య జరిగిన ఘట్టం అందరిని ఆకట్టుకుంది.వందలాదిగా ప్రజలు వచ్చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిల్‌రెడ్డి, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

పెనుమూరు: తూరుపుపల్లి ద్రౌపదీ ధర్మరాజులు ఆలయంలో మహాభారత ఉత్సవాల్లో బాగంగా ఆదివారం దుర్యోధన సంహార ఘట్టం వైభవంగా జరిగింది. వేషధారులు పద్యాలు పాడుతూ నాటకాన్ని రక్తికట్టించారు. ఉభయదారులుగా రాజేష్‌రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. నిర్వాహకులు చిరంజీవిరెడ్డి, యుగంధర్, ఢిల్లీ, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



పెనుమూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2001-02లో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన తామంగా కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు. తాము చదివిన పాఠశాలకు త్వరలో ఒక మంచి పని చేయాలని నిర్ణయించారు.

ఉచిత దంతమార్పిడి శస్త్రచికిత్స

చిత్తూరు రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన అమ్మఒడి ట్రస్ట్ ఆధ్వర్యంలో చెన్నైలోని చెట్టినాడు ఆస్పత్రిలో 16 మందికి ఉచిత దంత మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ట్రస్ట్ నిర్వాహకుడు పద్మనాభనాయుడు తెలిపారు. ఆపరేషన్ అనంతరం ఆదివారం వారిని చెన్నై నుంచి చిత్తూరుకు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. వీరందరికి ఆరు రోజుల పాటు భోజనం, ఆహారం, బస్‌చార్జీలను ఉచితంగా అందించినట్లు తెలిపారు.

మాతమ్మ తిరుణాళ్లకు పట్టు వస్త్రాల సమర్పణ

వెదురుకుప్పం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మాంబేడులో జరుగుతున్న మాతమ్మ తిరుణాళ్లకు ఆదివారం టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌మురళి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ క్రమంలో ఆలయ కార్యనిర్వాహకులు టీడీపీ నాయకులను సత్కరించారు. వీరిలో క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌మురళి, నీటిపారుదల సంఘం అధ్యక్షులు బోడిరెడ్డి ఈశ్వరరెడ్డి, నాయకులు సాతాల గుణశేఖర్, సురేష్, బాలాజీ, చిరంజీవి, నిరంజన్,తదితరులు ఉన్నారు.

బోరు మోటారుకు మరమ్మతులు చేయించండి



ఖాళీ బిందెలతో మహిళలు

పాలసముద్రం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కేజేపురం ఆదిఆంధ్రవాడ వాసులు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోరు మోటర్ మరమ్మతులకు గురై సుమారు వారం రోజులైనా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు ప్రత్యామ్యాయ ఏర్పాట్లు చేయక పోవడంతో వ్యవసాయ బోరు బావుల నుంచి బిందెలతో నీళ్లు తెచ్చుకోవలసి వస్తోందని వాపోతున్నారు. తాగునీరు సరఫరా లేనందున కూలీ పనులకు వెళ్లడానికి కూడా కష్టంగా ఉందంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బోరు మోటారుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

మాజీ సైనికుడికి ఎమ్మెల్యే మురళి నివాళి



చిత్తూరు సిటీ, జూన్ 1(ఆంధ్రప్రదేశ్): మాజీ సైనికుడు ఎస్. ఆనంద్ రాజ్ మృతదేహానికి ఎమ్మెల్యే కలికిరి మురళి మోహన్ నివాళులర్పించారు. కాజూరులో నివాసముంటున్న మాజీ సైనికుడు ఆనంద్‌రాజ్ మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆయన ఆదివారం నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని వారికి ధైర్యం చెప్పారు.

ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై వెలిగిన వీధి దీపాలు

చిత్తూరు సిటీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దొడ్డిపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జిపై 10 రోజులుగా వీధి దీపాలు వెలగడంలేదని రెండు రోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు అధికారలు స్పందించారు. ఈ మార్గంలో ప్రయాణించే పాదచారులు, ద్విచక్రవాహనాలు వీధిదీపాలు వెలగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో ఆదివారం వీధి దీపాలకు మరమ్మతులు చేసి వెలిగించారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతకు రసీదు అందిస్తున్న రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాణిపాకలో ఆలయం అన్నదాన కార్యక్రమానికి తిరుపతికి చెందిన భాగ్యవతి రూ.1,00,116 ఆదివారం విరాళంగా అందించారు. దాతను ఏఈవో రవీంద్రబాబు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. క్యాక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంగా బాధ్యతల స్వీకరణ



మర్రి శేఖర్

వెదురుకుప్పం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కార్వేటి నగరం బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా మర్రి శేఖర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న గాయత్రీదేవి నగరి మండలం చింతలపట్టెడ జడ్పీ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లారు. శాంతిపురం మండలం సోగాడ్పల్లె జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి శేఖర్ కార్వేటినగరానికి వచ్చారు. పాఠశాల ఉన్నతికి, విద్యాభివృద్ధికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

ధర్నాను జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : ఇళ్ల స్థలాల మంజూరు కోసం సోమవారం చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేయనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు కోరారు. ఆదివారం స్థానిక గాంధీ విగ్రహం ఎదుట ధర్నా పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వేలాది మంది పేదలు ఇళ్లు లేక బాడుగ ఇళ్లల్లో కాలగడుపుతున్నారని వారందరికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోపీనాథ్, మణి తదితరులు పాల్గొన్నారు.

56 మద్యం బాటిళ్ల సీజ్

చిత్తూరు అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన కర్ణాటక మద్యాన్ని ఆదివారం రెండవ పట్టణ పోలీసులు సీజ్ చేశారు. సీఐ నెట్టికంఠయ్య వివరాల మేరకు.. నగర పరిధిలోని లెనిన్‌కు చెందిన మూర్తి 56 కర్ణాటక బ్రాందీ, 12 బీరుబాటిళ్లను బీడు భూముల్లో దాచివుంచాడు. మద్యాన్ని సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేశారు.

పోలీసుల కార్డన్‌సెర్చ్

ఒకటవ పట్టణ పోలీసులు ఆదివారం నగర పరిధిలోని సంజయ్‌గాంధీనగర్‌లో కార్డన్‌సెర్చ్‌ను నిర్వహించారు. సీఐ మహేశ్వర ఆధ్వర్యంలో పోలీసులు సంజయ్‌గాంధీ నగర్‌లో ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా 30 ఆటోలు, ద్విచక్ర వాహనాలకు సరైన రికార్డులు చూపకపోవడంతో జరిమానాలు విధించినట్లు సీఐ తెలిపారు.

ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రదాయిని యోగా

చిత్తూరు కల్చరల్, జూన్1(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన ఆధ్యాత్మికత అలవర్చుకోవాలంటే యోగా అభ్యాసం చేయాలని స్కాలిచ్(ఆఫ్రికా)యోగా వ్యవస్థాపకులు విక్రమ్ మాస్టరు సూచించారు. ఆదివారం గిరింపేట సత్యసాయి సంస్థాన్ ఆధ్యాత్మికత- క్రమశిక్షణ -యోగా అనే అంశంపై ప్రసంగించారు. ఆయన పుట్టపర్తి నుంచి చెన్నై వెళ్తూ చిత్తూరు సత్యసాయి సంస్థాన్‌లో పాల్గొన్నారు. అనంతరం ఆయనను సత్యసాయి సంస్థాన్ నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమతి జిల్లా అధ్యక్షుడు యస్. మధుసూదనం, నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడు, శ్రీకంఠయ్య, పాండురంగం , గజేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధరల పతనంతో మామిడి రైతుల దిగాలు



విజయపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి) మామిడి ధరలు పతనమవుతున్నాయని రైతులు చెందుతున్నారు. మండలంలో సుమారు 1850 ఎకరాల్లో సింధూర, తోతాపురి, బంగినపల్లి, కాలేపాడు, ఖాదర్, నీలం వంటి రకాలను సాగు చేస్తున్నారు. ఇక్కడ నుంచి మామిడిని కోయంబేడు, తిరువళ్ళూరు, తిరుత్తణి, తిరుపతి, బెంగుళూరు, మహారాష్ట్ర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. ఈ యేడాది రెండు, మూడు సార్లు మందులు పిచికారి చేసినా ఆశించిన పూత రాలేదు. వచ్చినా కాయలు నిలబడలేదు. 35 శాతం కూడా దిగుబడి రాలేదని రైతుల చెబుతున్నారు. పక్వానికి వచ్చిన మామిడిని జ్యూస్ ప్యాక్టరీలకు తరలిస్తున్నారు. టన్ను సింధూర రూ.6-7వేలు, తోతాపురి రూ. 6-8 వేలు, బంగినపల్లి రూ. 15-20 వేలకు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. ప్యాక్టరీ యజమానులు సిండికేట్‌గా తయారై తమను నష్టాలపాలు చేస్తున్నారని కంట తడి పెడుతున్నారు. ప్రభుత్వం ధర ప్రకటించక పోవడంతో తోతాపురిని రూ.6 నుండి రూ.7 వేలకు అడుగుతున్నారని వాపోతున్నారు.

ప్రయివేటు వర్తకుల వైపు పరుగులు

జ్యూస్ ప్యాక్టరీలో ధరలు పతనం కావడంతో రైతులు తమిళనాడులోని ప్రవేటు వర్తకుల వైపు పరుగులు తీస్తున్నారు. దినసరి మార్కెట్‌లో అమ్ముకునే వ్యాపారులతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. సిందూర టన్ను రూ. 15 వేలు, బంగినపల్లి రూ. 25 వేలకు కొనుగోలు చేస్తున్నారు. అయితే తక్కువ సరకు కొనుగోలు చేయడం వీరికి ఇబ్బంది కలుగుతోంది. ఎకరా సాగు ఖర్చు రూ.30 వేల వరకు ఖర్చు చేసినా ఏమీ మిగలడంలేదని రైతులు చెబుతున్నారు.

బీమా నిరుపయోగం



ఈ యేడాది మూడు పర్యాయాలు మందులు పిచికారి చేశాను. ప్రారంభంలో పూత కనిపించినా మొత్తం రాలిపోయింది. రెండు సంవత్సరాల పాటు మామిడిలో నష్టమే చవిచూస్తున్నాను. బీమా ఉన్నా ప్రయోజనం లేదు.

-వెంకట్రాజు, మిట్టూరు

ప్రభుత్వం ఆదుకోవాలి



మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రెండేళ్ల పాటు మామిడిలో దిగుబడి లేదు. మంచు తీవ్రత వలన పూత రాలిపోయింది. దిగుబడి 35 శాతానికి కూడా మించలేదు. పెట్టుబడి కూడా రావడం లేదు.

కైలాసం యాదవ్, కోసలనగరం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నింద్ర, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల తరువాత తాము చదువుతున్న పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆదివారం కలుసుకున్నారు. నింద్ర జడ్పి ఉన్నత పాఠశాలలో 2005-06లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఉద్యోగం, వ్యాపారం, పెళ్లి రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా హాజరై సందడి చేశారు. పాఠశాల అభివృద్ధి కోసం సహకరించనున్నట్లు తెలిపారు.

మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

నింద్ర, జూన్ 1(ఆంధ్రజ్యోతి):తిరుపతి కేవీకే ఆధ్వర్యంలో అగరం, అత్తూరు గ్రామాల్లో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆదివారం రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్త సుధాకర్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో అనుసరించాల్సిన మేలైన యాజమాన్యం పద్ధతులు, భూసార పరీక్ష ప్రాముఖ్యత, భూసార పరీక్ష పత్రవినియోగం, వ్యవసాయ అనుబంధ రంగాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వ్యవసాయ అనుబంధ రంగాలైన కోళ్ల పెంపకం తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో నగరి వ్యవసాయాధికారి రాఘవేంద్ర, వ్యవసాయ సహాయకులు ప్రియ, గాంధీ, పట్టాభిరెడ్డి, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ చంద్రశేఖర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గంగారపు క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల (ఎస్వీసెట్) సమీపాన గోపి యువసేన ఆధ్వర్యంలో గంగారపు గోపి క్రికెట్ టోర్నమెంటును బ్యాటింగ్ చేసి ఎమ్మెల్యే మురళీమోహన్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. క్రీడాకారులు క్షణికావేశానికి గురికాకుండా ఉల్లాసంగా ఉత్సాహంగా ఆడాలన్నారు. అంతకుమునుపు పెనుమూరు క్రాస్‌రోడ్డు నుంచి సుమారు వంద ద్విచక్ర వాహనాలతో యువకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికాలరు కార్యక్రమంలో యువరాజు నాయుడు, దొరబాబు చౌదరి, గంగారపు గోపి, నాయకులు జగన్నాథం, రామూర్తి నాయుడు, మధు, గోవర్ధన్, నాదముని, గోపి యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

370 గ్రాముల వెండి వస్తువులు, వ్యవసాయ మోటార్ల స్వాధీనం



నిందితులను చూపుతున్న పోలీస్ అధికారులు

నగరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తాళాలు వేసిన ఇళ్లలో, వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ మోటార్ల చోరీలకు పాల్పడే ఇద్దరు నిందితులను సీఐ విక్రమ్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ వివరాలను ఆదివారం డీఎస్పీ మహమ్మద్ అజీజ్ మీడియాకు వెల్లడించారు. . శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు నగరి ఎస్ఐ విజయ నాయక్‌కు వచ్చిన సమాచారం మేరకు, మున్సిపాలిటీ, ఏకాంబరకుప్పం రైల్వే స్టేషన్ వద్ద అనుమాన్పాద రీతిలో తచ్చాడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. వీరు పుదుపేటకు చెందిన రాజేష్, జాన్సన్‌గా గుర్తించారు. వీరు ఇరువురు చిదంబర నగర్, పద్మావతి నగర్‌ల్లో రాత్రి పూట తాళం వేసి వున్న ఇంట్లోకి చొరబడి వెండి సామాన్లు, డబ్బులు, ఇతర వస్తువులు దొంగలించినట్లు తేలింది. ఎస్ఆర్ పురం మండలం, కొత్తపల్లి మిట్ట వద్ద వ్యవసాయ బావులకు అమర్చిన బోరు మోటార్లను కూడా చోరీ చేశారు. వారి నుంచి 370 గ్రాముల వెండి వస్తువులు, గ్యాస్ సిలిండర్, ఫ్యాన్, మూడు వ్యవసాయ బోరు మోటార్లు స్వాదీనం చేసుకున్నారు. నిందితులకు 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ



శ్రీరంగరాజపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 4న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం 49. కొత్తపల్లెమిట్ట దీపిక కళ్యాణ మండపంలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్రంలోని మహిళలను, విద్యార్థులను, శ్రామికులను రైతులను ప్రజలను సూపర్ సిక్స్ పేరుతో మోసం చేశారన్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గురవారెడ్డి, విజయబాబు, కుప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

రిటైరైన ఉద్యోగికి సత్కారం

వెదురుకుప్పం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహించిన రికార్డు అసిస్టెంటు సుబ్రహ్మణ్యంరెడ్డి సేవలు అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. రిటైరైన ఆయనకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం జరిగింది. పలువురు మాట్లాడుతూ ఆయన సేవలను కొనియాడి సత్కరించారు. అధ్యాపకులు, నాయకులు పాల్గొన్నారు.

పసుపులేటి హరిప్రసాద్‌కు శుభాకాంక్షలు

చిత్తూరు సిటీ, జూన్ 1 (ఆంధ్రప్రదేశ్): ఆంధ్రప్రదేశ్ హస్తకళ అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా ఎంపికైన జనసేన సీనియర్ నేత డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్‌కు జనసేననేత చంద్రశేఖర్ తదితరులు అభినందనలు తెలిపారు. ఆదివారం తిరుపతిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి, పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

బాలిక అదృశ్యం

బంగారుపాళ్యం,జూన్1 (ఆంధ్రజ్యోతి): ఓ మైనర్ బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. కేఎం కండ్రిగ పంచాయతీ కంతలచెరువు గ్రామానికి చెందిన మోహన్ కుమార్తె గత నెల 31వ తేదీన బంగారుపాళ్యంకు వచ్చి సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాలేదు. వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో ఆదివారం బాలిక తండ్రి ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వైభవంగా కల్యాణోత్సవం

గంగాధరనెల్లూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేపంజేరిలో ఆదివారం లక్ష్మీ నారాయణులకు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. పూజలకు బెంగళూరుకు చెందిన సంతోష్‌కుమార్ కుటుంబసభ్యులు, చిత్తూరు నగరానికి చెందిన వెంకట కొండారావు కుటుంబసభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, ద్వివేది, గోవిందస్వామి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

పూతలపట్టులో రేషన్ దుకాణంలో సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే మురళి



చిత్తూరు కాజూరు సర్కిల్ 20వ డివిజన్ షాపును ప్రారంభిస్తున్న చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత

పూతలపట్టు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ కోరారు. ఆదివారం పూతలపట్టులో చౌకదుకాణం వద్ద లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు రేషన్ సరుకులు తీసుకునేందుకు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నిర్ణయం తీసున్నారని చెప్పారు. తహసీల్దార్ రమేష్, దొరబాబు చౌదరి, గంగారపు గోపి తదితరులు పాల్గొన్నారు. **చిత్తూరు కలెక్టరేట్** : చిత్తూరు నగరం కాజూరు సర్కిల్‌లోని 20వ డివిజన్ రేషన్‌షాపును చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, 21, 33, 56, 68 షాపుల్లో మాజీ ఎమ్మెల్యే సీకే బాబు చిత్తూరు నగరంలో రేషన్ పంపిణీని లాంచనంగా ప్రారంభించారు. **విజయపురం:** ఇళ్ళత్తూరులో తహసీల్దార్ కిరణ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, విజయపురంల్కో ధనుంజయయాదవ్, మహారాజపురంలో బాలసుబ్రహ్మణ్యంరాజు ప్రారంభించారు. **గుడిపాల:** గుడిపాల చౌక దుకాణంలోనే సరుకుల పంపిణీలో మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, టీడీపీ సీనియర్ నేతలు బాలాజీనాయుడు, చెన్న కేశవునాయుడు పాల్గొన్నారు. చుక్కావారి పల్లెలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి హేమాద్రినాయుడు,రామభద్రాపురంలో పంపిణీ చేశారు. **యాదమరి:** కీనాటంపల్లి పంచాయతీలో జరిగిన పంపిణీలో తహసీల్దార్ పార్థసారథి, టీడీపీ అధికార ప్రతినిధి వల్లేరు అమర్‌నాథ నాయుడు, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు ఎం.ఎల్. ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. **పెనుమూరు:** మండలంలోని 35 రేషన్ షాపుల్లో ఉత్సవ వాతావరణంలో రేషన్ బియ్యం పంపిణీ చేసినట్లు తహసీల్దారు శ్రావణ్‌కుమార్ తెలిపారు. మండల అధ్యక్షులు రుద్రయ్యనాయుడు, తలారిరెడ్డెప్ప, భాస్కర్ పాల్గొన్నారు. **బంగారుపాళ్యం:** నలగాంపల్లె,కీరమంద,టేకుమంద,గుంతూరు,తంబుగానిపల్లె, కాటప్పగారిపల్లె గ్రామాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్పీ ధరణీప్రసాద్, మాజీ మండల అధ్యక్షులు ఎన్పీ సురేంద్రనాయుడు, ఎన్పీ జయప్రకాష్, సర్పంచు షీబా స్వామిదాస్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ చేశారు. దండువారిపల్లెలో ఆర్డీవో భవానీ, తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ పంపిణీ చేశారు. **వెదురుకుప్పం:** పెరుమాళ్లపలిలో చౌక దుకాణాన్ని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌మురళిప్రారంభించారు. మాంబేడులో జడ్పీటీసీ మాజీ సభ్యులు బండి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు **నింద్ర:** రేషన్ దుకాణాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. **నగరి:** కీళపట్టులో రేషన్ పంపిణీని ఆర్డీవో భవానీ శంకరి ఆదివారం ప్రారంభించారు. పలుచోట్ల తహసీల్దార్ రవికుమార్, మండల టీడీపీ అధ్యక్షుడు జవహర్‌లాల్‌రెడ్డి ఎ.వేణు, బాలాజీ పాల్గొన్నారు.



నగరి మండలం కీళపట్టులో నిత్యావసర వస్తువుల పంపిణీని పర్యవేక్షిస్తున్న ఆర్డీవో భవానీ